క్లుప్తంగా

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్యకళాశాల యాజమాన్యం గురువారం ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా వంద మంది విద్యార్థులు పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్యులు డి.విష్ణువర్ధన్, సీహెచ్ నాగరాజు, దదిరావు కృష్ణ వంశీ, శ్రియ, శ్వేతాశ్రీ మాట్లాడుతూ దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుల సాయం తీసుకోవాలన్నారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు సహాయ సహకారాలు అందించారు.

సాయిరామ్ కాలనీలో చోరీ

పీఎం పాలెం: జీవీఎంసీ 5వ వార్డు పరిధి సాయిరామ్ కాలనీలో చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయిరామ్ కాలనీలో చిల్ల మురళీకృష్ణ కుటుంబంతో నివసిస్తున్నారు. ఈ నెల 11న విజయనగరం జిల్లా భీమసింగిలో ఉంటున్న తల్లిని చూడటానికి ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి వెళ్లాడు. 12న సాయంత్రం 5 గంటలకు వచ్చి చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాలో భద్రపరచిన 13 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రెండు చేతిబోర్లు ప్రారంభం



మద్ది కన్నయ్యగారి కళ్లాల్లో బోరు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: చేతిబోర్ల ఏర్పాటుతో ప్రజల తాగునీటి అవసరాలు తీరుతాయని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో గల బొడ్డు వారి వీధి, కన్నయ్య గారి కళ్లాల్లో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన ఒక్కొక్క బోరును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కొక్క బోరు రూ.80 వేలతో నిర్మించామన్నారు. అవసరమైన చోట కుళాయిలు వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బుగత ఎర్నాయుడు, కనకల ప్రకాష్, కంటుబోతు రాజన్న పాల్గొన్నారు.

మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య

పీఎం పాలెం: ఓ వ్యక్తి మూడో ఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 5వ వార్డు పరిధి రాజీవ్ గృహకల్ప కాలనీలో తాడుతూరి ధర్మారావు (60), సత్యవతి నివసిస్తున్నారు. చాలా కాలంగా ధర్మారావు మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. తరచూ నగరంలోని మానసిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులు వైద్యం చేయిస్తున్నారు. శుక్రవారం ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతుండగా కుంగుబాటుకు గురైన ధర్మారావు మూడో అంతస్తు నుంచి దూకేశాడు. తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కొత్తపేటలో లో ఓల్టేజీ సమస్య

తగరపువలస: చిట్టివలస టౌన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరధిలోని కొత్తపేటను లో ఓల్టేజీ సమస్య వేధిస్తోంది. గత కొంత కాలంగా ఈ ప్రాంతంలోని వాణి విద్యానికేతన్, శ్రీరామకృష్ణ విద్యాలయం, చిట్టివలస జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంతంలో గృహోపకరణాలు సరిగా పనిచేయడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగించేందుకు ఫ్యాన్లు కూడా లో ఓల్టేజీ కారణంగా సరిగా పనిచేయడం లేదని అంటున్నారు. అవసరమైన చోట అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు వేసి లో ఓల్టేజీ సమస్యను సరిచేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులుగా శివారు రోడ్లు

- జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు





గంభీరం మాస్టర్ ప్లాన్ రోడ్డులో వేసిన చెత్త



హైవేకి సమీపంలో మాస్టర్ ప్లాన్ రోడ్డులో వేసిన చెత్త

మధురవాడ: కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్లు కొందరు లారీ యజమానుల కక్కుర్తితో డంపింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. మారికవలస ఆర్‌జీకే కాలనీ సమీపంలోని కాపులుప్పాడ వద్ద గల జీవీఎంసీ 'చెత్త నుంచి సంపద సృష్టించే డంపింగ్ యార్డు'కు తరలిస్తే డీజిల్ ఖర్చు పెరిగిపోతుందని, వారికి అందుబాటులో ఉండే, జన సంచారం తక్కువ ఉన్న రోడ్ల పక్కనే గృహ నిర్మాణ వ్యర్థాలు, డెబ్రిస్, ప్లంబింగ్ వ్యర్థాలతోపాటు కొబ్బరి, తాటి వ్యర్థాలు వేసేస్తున్నారు. దీంతో జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల పరిధిలోని కొమ్మాది ఓజోన్ వేలీ, మారికవలస – తిమ్మాపురం, యండాడ లా కాలేజీ, హైవే – గంభీరం, మిధిలాపురి ఉడా కాలనీ – ఐటీ సెజ్ తదితర మాస్టర్ ప్లాన్ రోడ్ల పక్కన ఎక్కడ చూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలు ఇలా వేసేయడం వల్ల పరిసరాలు అధ్వానంగా మారడంతోపాటు విలువైన ప్రభుత్వ స్థలాలు కూడా కలుషితమవుతున్నాయి.

లారీల యజమానులపై చర్యలు శూన్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో చెత్త నుంచి సంపద సృష్టించే యూనిట్లు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఇక్కడ చెత్త నుంచి విద్యుత్, బ్రిక్స్ వంటివి ఉత్పత్తి చేస్తున్నారు. అయితే ఈ యూనిట్లకు కావాల్సిన చెత్త కూడా పూర్తి స్థాయిలో లభ్యం కాకపోవడంతో పూర్తి స్థాయిలో పనిచేయలేకపోతున్నాయని జీవీఎంసీ ఉన్నతాధికారులే ప్రకటించారు. ఈ నేపథ్యంలో వ్యర్థాలను రోడ్ల పక్కన వేస్తున్న వారిపై చర్యలు తీసుకుని... డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకుంటే సంపద సృష్టించేందుకు అవసరమైన చెత్త లభించడంతోపాటు రోడ్ల పరిసరాలు కూడా శుభ్రంగా వుంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే రోడ్ల పక్కన వ్యర్థాలు డంప్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో ఆయా సచివాలయాల పరిధిలోని శానిటేషన్, ప్లానింగ్ సెక్రటరీలు, జోన్‌లోని టౌన్ ప్లానింగ్, శానిటరీ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంత మంది అధికారులు లారీల యజమానులతో కుమ్మక్కై పోతున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



గంభీరం మాస్టర్ ప్లాన్ రోడ్డులో హైవే సమీపంలో వేసిన ప్లంబింగ్ వ్యర్థాలు

నాణ్యమైన విద్య అందించాలి

పద్మనాభం: విద్యార్థులకు కస్తూర్బా సీఆర్టీలు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఏపీసీ బి.శ్రీనివాసరావు సూచించారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో గురువారం ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం మండలాల కస్తూర్బా విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు నేర్చుకున్న విద్య భవిష్యత్‌లో ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించిన స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలను అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఎం.వి.కృష్ణ కుమార్, జీసీడీవో కలేషా బేగం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు

ఓఎస్‌జీ ఫౌండేషన్ ద్వారా 2014 యూనిట్ల రక్తదానం

తగరపువలస: ఆనందపురం మండలానికి చెందిన ఓఎస్‌జీ ఫౌండేషన్ ద్వారా గత మూడేళ్లలో 40 శిబిరాలు నిర్వహించి 2014 యూనిట్ల రక్తం సేకరించినట్టు ఫౌండేషన్ అధ్యక్షుడు దళాయి శివ తెలిపారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా దాతలకు ధన్యవాదాలు తెలిపేందుకు ఆనందపురంలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ రక్తదాతలు మరొకరికి ప్రాణాలు పోస్తూ ప్రాణదాతలు అవుతున్నారన్నారు. ఇందులో మరింత మంది భాగస్వాములు కావాలని కోరారు. తలసేమియా, సికిల్‌సెల్, ఎనీమియా, హీమోఫీలియా వంటి జన్యుపరమైన వ్యాధులతో బాధపడేవారికి, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు జరిగే సమయంలో, రక్తహీనతతో బాధపడేవారికి రక్తం అందిస్తున్నామన్నారు. పురుషులు ప్రతి మూడు మాసాలకు, మహిళలు ప్రతి నాలుగు మాసాలకు రక్తదానం చేయాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

మధురవాడ: పని మీద కర్నూలు వెళ్లిన అచ్చిరెడ్డి వెంకటనాయుడు(55) అదృశ్యమయ్యాడు. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం కేవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ నిసార్గ్‌లో వెంకటనాయుడు నివసిస్తూ సైట్ మెటీరియల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి 10గంటలకు విశాఖ నుంచి బయలుదేరి కర్నూలు వెళ్లాడు. మరుసటి రోజున కర్నూలు చేరుకున్నట్టు కుమార్తె హారికకు సమాచారమిచ్చాడు. తర్వాత నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో వెంకటనాయుడు కుమార్తె లచ్చిరెడ్డి హారిక గురువారం సాయంత్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లచ్చిరెడ్డి వెంకట నాయుడు

పుస్తకాల పంపిణీ పరిశీలన



ఎంఈవో రమణకు సూచనలిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో ఉన్న స్టూడెంట్ కిట్ల పంపిణీని సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు గురువారం పర్యవేక్షించారు. ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ తీరును పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాల్సిన విధానంపై ఎంఈవో పొన్నగంటి రమణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు, ఐఈఆర్పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు వైద్య సేవలందించాలి

మహారాణిపేట : మారుమూల ప్రాంతాల్లో క్యాన్సర్ రోగులను గుర్తించి వారికి వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆంధ్రా మెడికల్ కాలేజీ పరిధిలో జరిగిన క్యాన్సర్ నివారణ శిక్షణలో ఆయన పాల్గొన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారిని సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే మరికొంత కాలం పాటు ఆ వ్యక్తి బతికే అవకాశం ఉంటుందని, ఆ కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు.

క్యాన్సర్ రాకుండా తీసుకునే చర్యల గురించి వివరించారు. నెల రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని, మొత్తం మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారు వారి పరిధిలో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎస్.సమత, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త అధికారి డాక్టర్ నిర్మలగౌరి, ఏఎంసీ అంకాలజీ విభాగం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ, ప్రోగ్రామ్ అధికారులు, అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన అధికారులు, గైనకాలజిస్టు, డెంటల్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

వలందపేటలో భారీ చోరీ

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలో బుధవారం మధ్యాహ్నం చిల్ల అప్పలరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో భారీ చోరీ జరిగింది. రూ.5 లక్షల వరకు నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు బాధితులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారి పండగ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఏర్పాటు చేసిన భోజనాలకు చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్న వ్యక్తి వచ్చినట్టు సీసీ కెమెరాలలో గుర్తించారు. ముగ్గురు అన్నదమ్ములు ఉమ్మడిగా ఏర్పాటు చేసుకున్న ఈ భోజనాలకు తమ సోదరుల తరపున వచ్చిన వ్యక్తిగా మిగిలిన వారు భావించారు. భోజనానికి వచ్చిన వ్యక్తే మద్యం కూడా సేవించి మధ్యాహ్నం 1.13 సమయంలో ఇంటిలో నుంచి డబ్బులు తీసుకుని బయటకు వచ్చినట్టు గుర్తించారు. దీనిపై భీమిలి పోలీసులు రెండు రోజులుగా ముమ్మరంగా విచారణ చేపట్టారు. శుక్రవారం జాతీయ రహదారి పక్కన సీసీ కెమెరాలను పరిశీలించనున్నారు. మొత్తం మీద బాగా తెలిసిన వ్యక్తే తమ ఇంట్లో చోరీకి పాల్పడినట్టు బాధిత కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవం



పద్మనాభం ముత్యాలమ్మ ఆలయం వద్ద కలశాలతో మహిళలు

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం ముత్యాలమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పద్మనాభం, మద్ది పంచాయతీ తునివలస గ్రామాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించారు. మహిళలు కళశాలతో అమ్మవారి ఆలయాల వద్దకు నీరు పట్టుకుని వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

విద్యార్థిని అదృశ్యం

పీఎం పాలెం: ఓ విద్యార్థిని అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన ఖనేజ్ పాయకరావుపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె కేజీహెచ్‌లో పనిచేస్తున్నారు. చిన్న కుమార్తె నౌషీన్ ఫాతిమా (20) నగరంలోని రామ్‌నగర్‌లో గల అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ పీఎం పాలెంలోని ఓ కళాశాలలో బీ ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 12న ఉదయం అమ్మమ్మ ఇంటి నుంచి బయలుదేరిన ఫాతిమా కళాశాలకు వెళ్లలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు.



నౌషీన్ ఫాతిమా

యువకుడు అదృశ్యంపై కేసు

పీఎం పాలెం: ఓ యువకుడి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ ఆరో వార్డు బక్కన్నపాలెంలో గల సాండ్ అండ్ సాండ్స్ లే అవుట్‌లో విశ్రాంత నేవల్ డాక్‌యార్డు ఉద్యోగి సాగిరాజు లక్ష్మణరాజు కుటుంబంతో నివసిస్తున్నారు. అతని కుమారుడు వీరభద్ర వర్మ రెండు నెలలుగా వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. ఈ నెల 11న ఉదయం నగరంలోని మాధవధార వెళ్తున్నానని బయలుదేరిన వీరభద్ర వర్మ అనంతరం ఇంటికి రాలేదు. ఇతను గత ఏడాది మే 10న ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకోగా... అనంతరం మనస్పర్థలతో ఆమె పుట్టింటి వద్దే వుంటోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో విడాకుల కోసం భార్యం నోటీసులు పంపించడంతో అప్పటి నుంచి వీరభద్రవర్మ మానసిక ఒత్తిడికి గురవుతున్నాడని ఫిర్యాదులో తండ్రి లక్ష్మణరాజు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు.



వీరభద్ర వర్మ

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మధురవాడ: కొమ్మాది జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో ఏడుబిల్ల శ్రీనివాసరావు (28)కి తీవ్ర గాయాలయ్యాయి. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పార్వతీపురం జిల్లా లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు శ్రీచైతన్య స్కూల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తూ మారికవలస ఆర్‌జీకే కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నారు. 11న రాత్రి 8.30 గంటల సమయంలో మధురవాడ నుంచి మారికవలస నడుచుకుంటూ ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి శ్రీనివాసరావును ఢీకొట్టి పరారయ్యాడు. దీంతో వైద్య నిమిత్తం గాయత్రి ఆస్పత్రికి తరలించగా అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. భార్య సుమతి గురువారం సాయంత్రం ఫిర్యాదు చేయడంతో పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిపైనే మార్కెట్‌తో అవస్థలు

వేములవలస – ఆనందపురం మార్గంలో ట్రాఫిక్ కష్టాలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలసలోని మహాత్మాగాంధీ పువ్వుల మార్కెట్ నిత్యం ఆనందపురం – వేములవలస – పెందుర్తి రహదారిపైనే జరుగుతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పేరుకే పువ్వుల మార్కెట్ అయినా ఇక్కడ కూరగాయలు, ఆకుకూరల వ్యాపారులు కూడా రోడ్డుపై తిష్ట వేసి ట్రాఫిక్‌కు రోజూ అంతరాయం కలిగిస్తుంటారు. రోజూ తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 10 వరకు ఇక్కడ లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. ఈ సమయంలో 300 మీటర్ల మేరకు రహదారి వ్యాపారుల హస్తాల్లోకి వెళ్లిపోతుంది. ఆ సమయంలో ఈ మార్గంలో ప్రయాణాలు సాగించేవారికి నరకం కనిపిస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర వ్యాపారస్తులు ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతుంటారు. ట్రాఫిక్ పోలీసులు మొక్కుబడిగా వచ్చి హాజరు వేసుకుని నాలుగు రకాల కూరగాయలు, పువ్వులు కొనుక్కుని వెళ్లిపోతారు తప్ప వీరికి సామాన్య ప్రజల గోడు పట్టదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేములవలస నుంచి ఆనందపురం, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఉన్న ఈ ఏకైక మార్గం సంతలా మారిపోతుండడంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాల్సి వస్తోంది. వేములవలస పంచాయతీ పాలకవర్గం, ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలని మండల ప్రజలు పలుమార్లు మొత్తుకుంటున్నా వీరి చెవికి ఎక్కడం లేదు. వేములవలస కూడలి కూడా వ్యాపారులు, వినియోగదారులు నిలిపి ఉంచిన వాహనాల కారణంగా ఇరుకుగా మారిపోయింది. ఏవైనా భారీ ప్రమాదాలు జరిగితే తప్ప ఇక్కడి అధికారులు స్పందించరా అంటూ వాహనదారులు నిత్యం ప్రశ్నిస్తున్నారు. రహదారిపై వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



వేములవలస – ఆనందపురం రహదారిపై నిర్వహిస్తున్న వ్యాపారాలు

తుది దశలో 'నాడు – నేడు' నిర్మాణ పనులు



చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌కు నిర్మిస్తున్న ముఖద్వారం



నిర్మిస్తున్న ప్రహరీ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 'నాడు – నేడు' నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ హైస్కూల్‌లో రూ.1.16 కోట్లతో వసతుల కల్పనకు నడుం బిగించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే నాలుగు అదనపు తరగతి గదులు, 12 యూనిట్ల టాయిలెట్లు, మేజర్, మైనర్ మరమ్మతులు పూర్తి చేశారు. ప్రస్తుతం హైస్కూల్ చుట్టూ ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. దీంతోపాటు ముఖద్వారం, మరో రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేయనున్నారు. భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో చాలా వరకు స్కూళ్లలో 'నాడు – నేడు' పనులు మొదటి దశలో పూర్తి కాగా బాలికల హైస్కూల్‌కు రెండో దశలో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే బాలికల హైస్కూల్‌కు పూర్తి స్థాయిలో వసతులు సమకూరినట్టు అవుతుందని ప్రస్తుత విద్యార్థులతోపాటు పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మలేరియాపై అవగాహన అవసరం

మద్దిలపాలెం : మలేరియాపై అవగాహన అవసరమని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ బ్రహ్మేకుమార్ అన్నారు. మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీని గురువారం శివాజీపాలెం, నౌకానగర్, పెదవాల్తేరు, కాగితాల వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వ ఉంటే దోమల ఉత్పత్తి అవకాశాలుగామారుతాయని, ఎప్పటికప్పుడు నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తాయని చెప్పారు. జ్వరం వస్తే ముందుగా పట్టణ ఆరోగ్య కేంద్రాలలో రక్త పరీక్షలు చేసుకోవాలని అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోనా వేణుగోపాల్, సచివాలయ ఏఎన్ఎం, ఆశా వర్కర్, జీవీఎంసీ యాంటీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



నౌకానగర్‌లో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



వుడా కాలనీ వద్ద చేతికి అందేంత ఎత్తులో ప్రమాదకరంగా విద్యుత్ లైన్



పాత మధురవాడ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మిధిలాపురి వుడా కాలనీ – వాంబేకాలనీ మార్గంలోని రోడ్డులో సెంటర్ లైటింగ్ విద్యుత్ వైర్లు నేలపైనే నిర్లక్ష్యంగా పడేసి ఉన్నాయి. జీవీఎంసీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం వుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డులో సెంటర్ లైటింగ్ విద్యుత్ వైర్లు చాలా అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఉడా కాలనీ, ఎన్‌జీజీవోస్ కాలనీ, సుద్దగెడ్డ, పాత మధురవాడ తదితర కాలనీలకు రోజూ వేలాంది మంది ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో వృద్ధులు, మహిళలు వాకింగ్ చేస్తుంటారు. సుమారు 5 వేల నివాసాలున్న వాంబే కాలనీకి ఇదే ప్రధాన మార్గం. ఇంత ముఖ్యమైన రోడ్డులో ఒక దాని నుంచి మరో విద్యుత్ స్తంభానికి వెళ్లే వైర్లు, వాటికి అమర్చిన ఫ్యూజ్ బాక్స్‌లు చేతికి అందేంత ఎత్తులో నెలలు తరబడి వదిలేశారని, ఇవి ప్రమాదకరంగా వున్నాయని పలువురు వాపోతున్నారు. ఏమాత్రం ఆదమరచి సంచరించినా పెను ప్రమాదమే సంభవించే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఎన్‌జీజీవోస్ కాలనీకి వెళ్లే దారి వద్ద ప్రమాదకరంగా రోడ్డుపైనే విద్యుత్ వైరు